క్లుప్తంగా

తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేనిది


కొత్త కోలమూరు స్కూల్ విద్యార్థులతో ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: తల్లిదండ్రుల రుణం ఏమిచ్చినా తీర్చుకోలేనిదని ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. కొత్త కోలమూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్, జీఎస్‌టీ ఆఫీసర్ కేవీఎస్ రవికుమార్, ట్రస్టు అధ్యక్షుడు టి.రవి తదితరులు విద్యార్థులకు చదువు, కెరీర్‌కు సంబంధించిన విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి విద్యార్థి ఇప్పటి నుంచే కెరీర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.అప్పారావు, సత్య చారిటబుల్ ట్రస్టు గౌరవ సలహాదారులు శ్రీరామమూర్తి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ కసిరెడ్డి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. రాయుడుపాకలు, కోలమూరు గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదన్నారు.

నర్సరీ రైతులకు వైద్య పరీక్షలు


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ వైద్య పరీక్షలతో పాటు నేత్ర, దంత, మధుమేహం, ఆర్థోపెడిక్, గుండె సంబంధిత వైద్య పరీక్షలను ఆయా విభాగాలకు చెందిన వైద్యులు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, ఉపాధ్యక్షుడు పెనుమాక కొండబాబు మాట్లాడుతూ కొన్నేళ్లుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ప్రముఖ నర్సరీ రైతులు పాల్గొన్నారు.

సంగీత ప్రముఖులకు నివాళి


జ్యోతిని వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ నాగలక్ష్మి

సీటీఆర్ఐ: మృదంగ రత్నాకర్ వరదరావు కమలాకరరావు, గాత్రం, వయోలిన్ విద్యాంసులు ఆకెళ్ల మల్లికార్జున శర్మ అందించిన సేవలు చిరస్మరణీయమని విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి అన్నారు. పాఠశాలలో బుధవారం సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకూ సంస్మరణ సభ, నెలవారీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత కమలాకర రావు, మల్లికార్జున శర్మ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. పాఠశాల అధ్యాపకులు ఎం.నరసింహారావు గాత్ర కచేరి చేయగా, వయోలిన్ కేటీ సుబ్బారాయన్, మృదంగం కె.సాయికృష్ణ సహకారం అందించారు.

రూ.1.20 లక్షల అపహరణ

కంబాలచెరువు: ఏటీఎంలో నగదు డ్రా చేయడానికి సాయం చేస్తున్నట్టు నటించి రూ.1.20 లక్షలను అపహరించిన ఘటనపై బుధవారం ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఆవ రోడ్డుకు చెందిన సుబ్బలక్ష్మి ఈ నెల 10వ తేదీన నగదు తీసుకునేందుకు తాడితోట పెట్రోల్ బంక్ సమీపంలోని ఏటీఎంకు వెళ్లింది. అప్పటికే అక్కడ ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉన్నాడు. ఆ ఏటీఎంలో నగదు లేదని చెప్పి, ఒక్కసారి ట్రై చేస్తానని ఆమె నుంచి ఏటీఎం కార్డు తీసుకున్నాడు. ఆమె నుంచి పిన్ నంబర్‌ను కూడా తెలుసుకుని ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేస్తున్నట్టు నటించాడు. ఏటీఎంలో డబ్బులు రావడం లేదని చెప్పి ఆమెకు మరో ఏటీఎం కార్డు మార్చి ఇచ్చాడు. ఈ విషయం గమనించని సుబ్బలక్ష్మి తన ఇంటికి వెళ్లిపోయింది. అయితే మర్నాడు ఆమె ఖాతాలో రూ.1.20 లక్షలు విత్ డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే బ్యాంకు వద్దకు వెళ్లి విచారణ చేసింది. వారు ఇచ్చిన వివరాలు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సినిమాలు

శ్యామల	: కంగువా
సూర్యమినీ	: గ్లాడియేటర్-2
సూర్యప్యాలెస్	: కంగువా
శివజ్యోతి	: మట్కా
అనుశ్రీ	: క
స్వామి	: అమరన్
అశోక	: లక్కీభాస్కర్
రాజా	: అమరన్
రంభ	: సి 202
ఊర్వశి	: కంగువా
మేనక	: జితేందర్‌రెడ్డి,గ్లాడియేటర్-2
కుమారి	: గ్లాడియేటర్-2
అప్సర	: మట్కా

గాలిని శుభ్రం చేసేద్దామా..

- వాయు కాలుష్యం నివారణకు కొత్త టెక్నాలజీ
- ఎన్‌సీఏపీ నిధులతో మెషీన్ కొనుగోలు
- కాలుష్య ప్రాంతాల్లో గాలిలోకి నీరు పిచికారీ


మంచినీటిని గాలిలోకి వెదజల్లుతున్న మెషీన్

సీటీఆర్ఐ: ఆధునిక కాలంలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో కాలుష్యం ఒకటి. దీని కారణంగా అనేక అనారోగ్యాలు కలుగుతున్నాయి. వివిధ రకాల వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా పట్టణాల్లో వాహనాల రద్దీ బాగా ఎక్కువగా ఉంటుంది. పెద్ద భవనాలు, అపార్టుమెంట్లు, కాంక్రీట్ రోడ్లతో పచ్చదనం కనిపించదు. వాహనాల నుంచి వెలువడే పొగతో పాటు చెట్లు లేకపోవడంతో గాలిలో ఆక్సిజన్ శాతం తగ్గిపోతుంది. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. మన రాజమహేంద్రవరానికి కూడా త్వరలో ఆ పరిస్థితి రావొచ్చు. ఈ నేపథ్యంలో వాయు కాలుష్యం నియంత్రణకు నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. గాలిని శుభ్రం చేయడానికి కొత్త మెషీన్‌ను తీసుకువచ్చింది.

పెరుగుతున్న జనాభా

రాజమహేంద్రవరంలో జనాభా విపరీతంగా పెరిగిపోతోంది. విద్య, ఉద్యోగం, వ్యాపారం, జీవనోపాధి తదితర కారణాలతో నిత్యం అనేక మంది నగరానికి వలస వస్తున్నారు. ప్రముఖ వ్యాపార కేంద్రం కూడా కావడంతో వివిధ జిల్లాల నుంచి అనేక మంది దుస్తులు, బంగారం, వివిధ వస్తువులు కొనుగోలు చేయడానికి వస్తారు. దీంతో నగరంలో రోడ్లన్నీ ఎప్పుడూ రద్దీగానే ఉంటాయి. వాహనాలు విపరీతంగా పెరిగిపోవడంతో వాయు కాలుష్యం కూడా ఎక్కువవుతోంది. ప్రస్తుతం నగరంలో ఆరు లక్షల మందికి పైగా జనాభా ఉన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి

> నగరంలో కాలుష్య ప్రాంతాలను గుర్తించి, అక్కడ వాహనంలోని మెషీన్ ద్వారా నీటిని వెదజల్లడానికి చర్యలు తీసుకుంటున్నాం. దాని కోసం ప్రత్యేకంగా షెడ్యూల్ రూపొందిస్తున్నాం. గాలిలో దుమ్ము బాగా ఉండే ప్రాంతాలలో నీటిని వెదజల్లుతున్నాం. నగరంలో కాలుష్య నియంత్రణకు సమష్టిగా కృషి చేయాలి.
>
> – కేతన్ గార్గ్, కార్పొరేషన్ కమిషనర్, రాజమహేంద్రవరం

ప్రధాన కూడళ్లలో..

నగరంలోని అనేక ప్రధాన కూడళ్లు ఉన్నాయి. వాహనాల నియంత్రణ కోసం ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. రెడ్ లైట్ పడినప్పుడు ఆ రోడ్డుపై వాహనాలు బారులు తీరుతాయి. కానీ వాటి ఇంజిన్లను ఆపకపోవడంతో దట్టమైన పొగ వెలువడుతూనే ఉంటోంది. దాని వల్ల కాలుష్యం పెరగడంతో పాటు వాహన చోదకులకు అనారోగ్యం కలుగుతోంది.

కాంక్రీట్ జంగిల్

రాజమహేంద్రవరంలో ఎక్కడ చూసినా అపార్టుమెంటులే కనిపిస్తున్నాయి. చెట్లను నరికివేసి, ఉన్న స్థలంలో కొంచెం కూడా వదలకుండా భవనాలు నిర్మిస్తున్నారు. దీంతో పచ్చదనం కనుచూపు మేర కనిపించడం లేదు. అక్కడక్కడా పార్కుల్లో మినహాయించి మిగిలినదంతా కాంక్రీట్ జంగిలే. స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను ఇచ్చే చెట్లు లేకపోవడంతో గాలిలో కార్బన్ డయాక్సైడ్ పెరిగిపోతోంది. అనే రుగ్మతలు తలెత్తుతున్నాయి.

గాలి నాణ్యత పెంచడానికి మెషీన్


వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా నగరంలో గాలి నాణ్యతను పెంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా ఎన్కాప్ నిధులతో వాటర్ స్ప్రింకిల్డ్ ఫాగ్ కొనన్ మిస్టింగ్ మెషీన్‌ను కొనుగోలు చేశారు. దీన్ని ఇటీవల నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా మంచి నీటిని గాలిలోకి వెదజల్లుతారు. తద్వారా గాలిలోని కాలుష్యం తగ్గుతుంది. దుమ్ము, దూళి, ఇతర కాలుష్య కణాలు నీటితో కిందకు పడిపోతాయి.

ఒక వాహనంపై ఈ మెషీన్‌ను ఏర్పాటు చేస్తారు. ముందుగా వేసుకున్న షెడ్యూల్ ప్రకారం వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ ఆ వాహనాన్ని తీసుకువెళతారు. అక్కడి నిలిపి నీటిని వెదజల్లుతారు. ఈ మెషీన్ నిరంతరాయంగా రెండు గంటల పాటు పనిచేస్తుంది.

ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలి


ఆరోగ్య సహాయకులకు మెటీరియల్ అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మలేరియా అధికారి డాక్టర్ సంధ్య

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)/కంబాలచెరువు: ప్రజారోగ్య పరిరక్షణలో ఆరోగ్య సహాయకులు కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ద్వారా వ్యాధుల బారి నుంచి రక్షించాలని జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె.సంధ్య పిలుపునిచ్చారు. స్థానిక ఆనం కళా కేంద్రంలో ఆరోగ్య సహాయకులకు జరుగుతున్న పునశ్చరణ తరగతులకు రెండో రోజు బుధవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, ఫైలేరియాతో పాటు వాతావరణ మార్పులతో సంభవించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోగలుగుతారన్నారు. దోమల లార్వా నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలను గ్రామాల్లో ఆరోగ్య సహాయకులు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. జిల్లా సహాయ మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సహాయకుల విధులు, బాధ్యతలను వివరించారు. గృహ సందర్శనకు వెళ్లినప్పుడు జ్వర పీడితులను గుర్తించి, వారి రక్తనమూనాలను సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. పలు వ్యాధుల లక్షణాలు, వాటి నివారణ మార్గాలను సీనియర్ ఎంటమాలజిస్టు ఐ.రామకృష్ణారావు వివరించారు. ముఖ్యంగా దోమల నియంత్రణకు వినియోగించే స్ప్రేయర్లు, వాడే ఔషధాలను ప్రదర్శన రూపంలో శిక్షకులకు చూపించారు. జిల్లా మలేరియా అధికారులు రెండ్రోజులు నిర్వహించిన ఈ శిక్షణ వైద్య, ఆరోగ్య ఉద్యోగులకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్ అన్నారు.

పిల్లలకు నూరుశాతం వ్యాక్సినేషన్ చేయాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లాలోని పిల్లలందరికీ నూరు శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రాజకుమారి అన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఇన్నీసుపేట యూపీహెచ్‌సీ సమావేశపు హాల్లో రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యాధికారులకు, సూపర్ వైజర్లకు సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి పర్యవేక్షణలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వేలైన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.భవాని ఈ కార్యక్రమం జరిపారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సిన్ వేసే విధానం, ఆ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రస్తుతం ఏడాదిలోపు పిల్లలకు 11 రకాల వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ చేస్తున్నామన్నారు. బిడ్డకు వ్యాక్సిన్ ఇచ్చే వరకూ కోల్డ్ చైన్ సిస్టం జాగ్రత్తగా ఉండాలన్నారు . గర్భిణులు, పిల్లలకు వేసిన టీకాల వివరాలను అదే రోజు యువిన్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీహరి, ప్రోగ్రామ్ అధికారులు షమ్మీ కుమార్, హరిశ్చంద్ర ప్రసాద్, మౌనిక, నిషాంత్, సీహెచ్‌వో శర్మ, డీసీసీఎం సామిత్, ఆరోగ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పని గంటలు పెంచొద్దు


వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు: పాఠశాలల పని గంటలను పెంచుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఇచ్చిన మౌఖిక ఉత్తర్వులు వెంటనే విరమించుకోవాలని యూటీఎఫ్ జిల్లా సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో సభ్యులు బుధవారం విద్యాశాఖ కార్యాలయ ఏడీ వెంకట్రాజుకు వినతిపత్రం అందించారు. ఈ నెల 20 నుంచి మండలానికి ఒక ఉన్నత పాఠశాల ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేయాలని డీఈఓ కార్యాలయం నుంచి మౌఖిక ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పని గంటలు పెంచడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారని పేర్కొన్నారు. ఇన్ని పనిగంటలు దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. తమ విజ్ఞాపనను వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కె.రమేష్, సీహెచ్ దయానిధి, ప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అంగర రమేష్

కడియం: గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల అధ్యక్షతన జరిగింది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ చైర్మన్ అంగర రమేష్ చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్లు, వాటర్ బాటిళ్లు, జనరల్ నాలెడ్జ్, గ్రామర్ పుస్తకాలను పంపిణీ చేశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, విశ్రాంత ఎంఈవో వి.లజపతిరాయ్, మెడికల్ ఆఫీసర్ ఎంవీబీ రామకృష్ణ, స్థానిక ప్రముఖులు బోణం సత్యనారాయణ, తోరాటి వసంతరావు, చిలుకూరి వెంకటేశ్వరరావు, జయరాజ్, ఆకుల సూర్యనారాయణ, డాక్టర్ గుబ్రాల వెంకట్రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం అక్షరాస్యతా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వారం రోజుల పాటు ఘనంగా జరిగిన గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు పలు గ్రంథాలయాల్లో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇన్నీసుపేట గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆల్కాట్‌తోట గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమానికి రామానుజన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం ఎంఎస్ జేస్సీ హాజరయ్యారు.

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్ఎస్‌వీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి


పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: సహకార సంఘాల బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు అన్నారు. తొర్రేడు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం(పీఏసీఎస్)లో బుధవారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్.శ్రీరాములు, పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు, జిల్లా సహకార ఆడిట్ అధికారి జగన్నాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆగ్రో టెక్నాలజీస్ సహకారంతో పశువైద్యశాలలో ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని ఆర్.శ్రీరాములు నాయుడు, ఎం.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. పాడి రైతులకు మందులను, మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. సొసైటీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ సహకార సంఘాలను బలోపేతం చేయడం కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమన్నారు. రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు సహకార వారోత్సవాలు ప్రాముఖ్యతను వివరించారు. పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎం.వెంకటేశ్వర్లు, మునారో ఆగ్రో టెక్నాలజీస్ రీజినల్ మేనేజర్ కె.కృష్ణ మాట్లాడారు. సంఘ సీఈవో కేవీవీ సత్యనారాయణ సభ్యులకు సంఘం చేస్తున్న సేవలను వివరించారు. విశ్రాంత సీఈవోలు తోట వెంకట్రామయ్య, జి.సుధాకరవర్మలను సొసైటీ తరఫున సత్కరించారు. సొసైటీ ఇన్‌చార్జి కె.ఉమాపార్వతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రవివర్మ, పశువైద్యుడు డాక్టర్ ప్రసన్న కుమార్, జిల్లా సహకార బ్యాంకు నోడల్ అధికారి ఎస్.ఉమారాణి, డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ఎస్.గౌసియాసుల్తానా బేగం పాల్గొన్నారు.

అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు


అసెంబ్లీ ప్రాంగణంలో అధ్యాపకులు, విద్యార్థులు

సీటీఆర్ఐ: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం తాడేపల్లిలోని రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. కళాశాల ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి సూచనల ప్రకారం ముగ్గురు అధ్యాపకులు విద్యార్థులను అక్కడకు తీసుకువెళ్లారు.

దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న భాష్యం చైర్మన్ రామకృష్ణ

కంబాలచెరువు: దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని, అందరూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి జోన్‌లోని ఏడు బ్రాంచ్‌లకు చెందిన సుమారు 1100 మంది విద్యార్థులు హాజరయ్యారు. భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రతి విద్యార్థి దృష్టి సారించాలన్నారు. విద్యాసంస్థల ముఖ్య సలహాదారులు మైకల్ రాజు మాట్లాడుతూ జీవితానికి వెలుగునిచ్చేది ఉపాధ్యాయుడే అన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా భాష్యం జోనల్ ఇన్‌చార్జులు వల్లూరి గోవిందరాజులు, వి.ఆంజనేయులు పర్యవేక్షించారు.

పిల్లలు క్రమశిక్షణతో మెలగాలి


బహుమతులు అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు

రాజమహేంద్రవరం రూరల్: పిల్లలు క్రమశిక్షణతో మెలగాలని, వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ఎలాంటి న్యాయ సమస్యలున్నా జిల్లా న్యాయసేవాధికారసంస్థకు తెలియజేయాలన్నారు. అనంతరం భోజనశాలను సందర్శించి ఆహారనాణ్యతను పరిశీలించారు. జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖాధికారి పి.విజయకుమారి, డీఐ దిలీప్ కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఏ.విజయప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పి.సూర్యప్రభావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన


చెక్కు బుక్ అందజేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగి శ్రీనివాస్‌రెడ్డి

సీటీఆర్ఐ: డిజిటల్ యాక్టివేషన్‌పై చిరు వ్యాపారులందరూ అవగాహన కలిగి ఉండాలని మెప్మా సంస్థాగత నిర్మాణ స్పెషలిస్టు పి.శ్రీదేవి అన్నారు. ఈ మేరకు స్థానిక మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాలు, చిరువ్యాపారులకు బుధవారం బ్యాంక్ సిబ్బంది వారితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం స్వనిధి రుణాలు, జన్‌ధన్ ఖాతాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోందని, డబ్బు లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయన్నారు. వాటిపై సరైన అవగాహన లేకపోతే ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. సమావేశంలో సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి, టీఎంసీ సాయికుమార్, ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి శ్రీనివాస్ రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

నేషనల్ క్రిస్టియన్ బోర్డు కమిటీ ఆవిర్భావం


బోర్డు కమిటీ సభ్యులను సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: అల్లూరి సీతారామరాజు జిల్లా నేషనల్ క్రిస్టియన్ బోర్డు కమిటీ ఆవిర్భావం బుధవారం ఘనంగా జరిగింది. ఆనందనగర్‌లోని జెరూసలేం ప్రేయర్ ఫెలోషిప్ చర్చి ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బోర్డు అధ్యక్షుడిగా సీహెచ్ఎం డేవిడ్ రాజు, ఉపాధ్యక్షుడిగా పి.డేవిడ్ రాజు, సెక్రటరీగా సి.విజయ రాజు, జాయింట్ సెక్రటరీగా ఎస్.ఇర్మియా, ట్రెజరర్‌గా వి.రవికుమార్ ఎంపికయ్యారు. వీరిని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బి.నవీన్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అమృత రావు, సెక్రటరీ డేవిడ్ మార్క్ ప్రకటించారు. నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ నాయకుడు జాన్ మాస్కె ఆదేశాలతో ఈ నియామకం జరిపినట్లు డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాల నుంచి వచ్చిన దైవజనులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కంబాలచెరువు: విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం విశ్రాంత పోలీసు అధికారుల కార్యాలయంలో జరిగింది. గౌరవ అధ్యక్షుడు పి.రామకృష్ణ, కె.సాల్మన్‌రాజు, బీవీ.రమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడిగా ఎస్ఈఏఎం షరీఫ్, ఉపాధ్యక్షుడిగా కె.సూర్యనారాయణ, జనరల్ సెక్రటరీగా ఎస్ఎం షరీఫ్, ట్రెజరర్‌గా కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పి.చంద్రశేఖర్, ఇ.భద్రరావు, సీహెచ్ అప్పారావు, జి.జనార్దనరావు, జీఎస్ మోహన్‌రాజు, డీవీవీ ప్రసాద్ ఎన్నికయ్యారు.

పోరాటంతోనే హక్కులకు రక్షణ

ప్రకాశం నగర్: పోరాటంతోనే హక్కులను కాపాడుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్ఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. స్థానిక అంబల్ల సూర్యారావు భవన్‌లో బుధవారం ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా 36వ సభ జరిగింది. అంతకు ముందు సంఘం పతాకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలన్నారు. ప్రముఖ విద్యావేత్త టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సంఘ ఉపాధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు.

ఈఎస్ఐ హాస్పిటల్ అభివృద్ధికి ప్రతిపాదనలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ హాస్పిటల్‌ను వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఇతర కార్మిక సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టిన విషయమై ఆయన స్పందించారు. ఈ మేరకు బుధవారం కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జగదీప్ గాంధీ ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో జరిపిన చర్చలు సఫలీకృతమయ్యాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ఇతర కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ తాము తెలిపిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో ఈ నెలలో విజయవాడలో చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాన్ని విరమించుకున్నామని ప్రకటించారు.